# సాహిత్యోద్యానము

ఆ విద్యార్థికి చదువుకుంటున్న కాలములో కూడా సారస్వతోద్యానవనములో విహరించవలెననే వాంఛ బయలుదేరకపోలేదు. కాని తండ్రి అతనిని ఎప్పుడూ ఒక కంట కనిపెట్టుతూ ఉండేవాడు. "దానికి ఇప్పుడేమి తొందరలేదుగాని ముందు బాగా చదువుకో ఈపరీక్ష కాస్తా ప్యాసయిన తరువాత నీయిష్టము వచ్చినన్ని వ్రాతలు వ్రాయవచ్చు" అని మందలిస్తూ వచ్చాడు.

తండ్రి అపేక్షించినట్లుగా ఉత్తీర్ణుడు కాకపోయినా ఒక విధముగా పరీక్షలో అయినాననిపించుకొన్నాడు విద్యార్థి. జీవితములో ఉద్యోగము చేయవలసి వచ్చిన సమస్యలూ అవసరాలు అతనికి వెంటనే కలిగాయి. విద్యార్థి ఉద్యోగము కొరకు అన్వేషించటము మొదలుపెట్టాడు

ఉద్యోగము లభించే లోపల విద్యార్థిని అనేక గృహకల్లోలాలు పీడిస్తూ ఉండేవి అయినా అతని మనసులో సారస్వతాభిలాష అణగిపోలేదు. ఉబికి ఉబికి పైకి పొంగుతూ ఉండేది.

శారదాదేవి దగ్గర ఒక చిన్న గుణమున్నది. దానిని అవగుణ మనుకొంటే ఆమెకు కోపము వస్తుందేమో! ఆమెకు పొరుగు బొత్తిగా గిట్టదంటే అందరూ నమ్మరు. అయితే తనది పై చెయ్యి కావాలి-కాకపోతే చూసీచూడనట్టే ఉంటుంది. విద్యార్థికి సంతృప్తిని కలిగించేపాటి ఉద్యోగము లభించినట్లయితే అతని సాహిత్యాభిలాష అంతచేటు పొంగకపోవునేమో! అతని ఆవేశము అలలతో పైకి లేచి ఆకాశాన్ని అంటవలెనన్న కాంక్షతో పొంగిపొరలే కడలిరాజు ఆవేశములా ఉన్నది ఉద్రేకము ఏరూపములోనైనా బయటికి వస్తేగాని అతనికి శాంతి లభించేటట్లు లేదు. అంతకంతకు అతనికి ఏమీ తోచకుండాకూడా పోయింది.

వైద్యులు కొందరన్నారు. చల్లగాలికి విహరిస్తూ ఉంటే తాపోపశమనము అవుతుందని. నాలుగు సంవత్సరాల క్రిందట జరిగినట్టుగా కవిత్వానికి-కథానికకు

పోటీలు జరుగుతాయని సరిగా ఆరోజులలోనే పత్రికలు ప్రకటించాయి. విద్యార్థి తన మనసును పట్టలేకపోయినాడు ఒకినాడు మంచి ముహూర్తము చూసుకొని - హనుమంతుడు సీతాన్వేషణకు బయలుదేరేముందర చేసే ప్రతిజ్ఞలను ముమ్మారు పఠించి బయలుదేరాడు

పురోద్యానవనము సమీపించి ఒక ద్వారము దగ్గరికి విద్యార్థి వెళ్ళాడు. లోపల ప్రవేశించటానికి అందరికీ అధికారము ఉన్నదికదా అనుకొని పాదము పెట్ట బోయే సమయానికి ఇటు నుంచి ఒకరు అటునుంచి ఒకరు రానే వచ్చారు. మని షిని నిలువవేసి 'ఎక్కడికి ఎక్కడికి?' అన్నారు.

విద్యార్థి ధైర్యస్థుడే గాని నిలువదీసి అడిగేసరికి బిత్తరపోయి 'లోపల విహ రించటానికని వెళ్ళుతున్నా' నన్నాడు కాస్త సర్దుకొని.

"అక్కడ వేళ్ళాడగట్టిన బోర్డును చూశావా?" అన్నారు.

"చూశాను" అన్నాడు.

"భాషాజ్ఞానము బాగా ఉన్నదా?"

"తగినంత ఉన్నది"

"సంస్కృతభాషా ప్రవేశము ఉన్నదా?"

"వీళ్ళతో నిజము చెప్పవలెనని ఎక్కడ వ్రాసిపెట్టివున్నదనుకొని 'కొద్దిగా ఉన్నదన్నాడు".

"నీవు ఎన్ని కావ్యాలు చదువుకొన్నావు? గురుముఖముగా చదువుకున్నావా?' ఇత్యాది ప్రశ్నలు కురిపించారు? మనసులో అధైర్యము తోచినా పైకి చికాకుగా "మీరు ఏమధికారము ఉన్నదని ఇలా ఆభ్యంతరపరుస్తున్నారు". అన్నాడు విద్యార్థి సన్నగా.

"అబ్బే! మాకేమభ్యంతరము? మేము నీ మంచికోసమే చెప్పుతున్నాము. అటువైపున మరో ద్వార మున్నది. అక్కడ కఠిన నియమాలు లేవు. యతిప్రాసల గోల అసలే లేదు. నీవంటి ఉత్సాహపరులకు అది చాలా సులువైన మార్గము"అని దారి చూపించారు.

విద్యార్థికి వాళ్ళమీద అంతగా కోపము రాలేదు. ఎందుకంటె ఇటు వీలు లేకపోయినా లోపలకి వెళ్ళటానికి మరోదారి చూపించారుగా! పెద్దపెద్ద అంగలు వేస్తూ ఆద్వారము సమీపించి లోపల అడుగుపెట్టబోతూ ఇటు అటు చూశాడు. ఎదురుగా వచ్చిన కాపరులు నలుగురు నాలుగు ప్రశ్నలువేసి 'అబ్బాయీ! నీ మాటలను బట్టి చూస్తే ఈ మార్గము చాలా సులభమైన దనగా విని వచ్చినట్లున్నావు. నీ కిష్టమయితే ఈ ప్రక్కన మరో చిన్న బాట ఉన్నది. అది నీకు తగినదని మా అభిప్రాయము' అని దారి చూపించారు. తల ఎత్తిచూడగా అది కథావీథి. ఈ మార్గాన వెళ్ళినవారితో విద్యార్థికి మంచి పరిచయమే ఉన్నది. మరీ క్రొత్త చోట కాస్త ఎరిగినవాళ్ళు కనబడితే ధైర్యముగా ఉంటుందనుకొని ఆబాటన అడుగులు వేశాడు విద్యార్థి. ఎవరో తప్పటడుగుల వాడనుకున్నారు కాబోలు నాలుగడుగులు వేసేవరకు విద్యార్థిని ఎవరూ గమనించనే లేదు. అయిదో అడుగు వేయబోయే సరికి అక్కడ సిద్ధమైనారు కాపరులు.

సాహిత్యోపాసనకు ఇది సులువైన మార్గమని తనను అందరు ఇటు నెట్టిన విషయము వాళ్ళతో చెప్పక 'ఇది నా అభిమాన మార్గము' అన్నాడు విద్యార్థి చాలాచాలా గ్రంథాలు చదివానని చెప్పాడు వాళ్లు అడగక ముందే.

'అబ్బాయీ! కాస్త నిదానించు దీనికి సూక్ష్మపరిశీలన చాలా అవసరము తెలిసిందా?'' అన్నారు.

''దీనికి నియమాలేవీ లేవు చాలా సులభమైనదని మావాళ్ళంతా అనుకోగా విన్నాను. కథానిక అంటే నే నెరిగినవీ చూసినవీ నాలుగు సంఘటనలను గుదిగ్రుచ్చి వ్రాయటమేగా! పెద్ద పెద్ద సమాసాలు అందమైనవి కొన్ని నోటికి వచ్చులెండి. అవసర మనిపించినచో వాటిని తగిలిస్తాను. కథానికా మేడ్ ఈజీ (Kathanika Made Easy అనే గ్రంథము బాగా చదివాను. నేను చిన్నకథ వ్రాయలేననే సందేహము మీకు ఇంకా వున్నదా?'' అన్నాడు విద్యార్థి.

''బాహ్య లక్షణాలైనా నీకు తెలుసునో లేదో అని మాకు సందేహముగా వున్నది. కథను పెద్దపెద్ద సమాసాలతోను వర్ణనలతోను నింపివేయకూడదయ్యా నాయనా! పఠితలకు భయ సంభ్రమాశ్చర్యాలను కలిగించే విచిత్ర సంఘటనలతో రచన చేయాలి. కథాంశము అపూర్వమైనదిగా ఉండాలి కథకు దూరముగా సాగిపోకూడదనేది సామాన్యసూత్రము. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని-చక్కని రచనా పాటవమును సంపాదించుకొని రా'' అన్నారు.

విద్యార్థి ఇంటి దారిన పడ్డాడు. పాత పత్రికలు కథల పుస్తకాలు బాగా చదివాడు. నాలుగు రోజులలో మొదటి కథను తయారుచేయగలిగాడు. ఆ విధంగా నాలుగుకథలను వ్రాసి వెంట తీసుకొని వెళ్ళాడు.

అక్కడ అందరు వాటిని చదివారు. "అబ్బాయి! భావమే కాదోయి కథలకు భాషైక్యము కూడా అవసరము. అది లేకపోతే 'తీర్థానికి తీర్థము-ప్రసాదానికి ప్రసాదము'లా ఉంటుంది. ఉదాత్తమయిన భావాలతో రచించాలి. ప్రపంచవృత్తము ప్రకటించటానికి కథానిక అనువైనది. కాని కావ్యభాషతో దాని జీవకళ కాస్తా చెదరిపోతుంది, వస్తుగ్రహణములో కూడా వైవిధ్యము వైచిత్రము కనబడచాలి దానికి తగిన నైపుణ్యము మెచ్చుకోదగినది ముఖ్యమైనదీను, కథ అంటే కబుర్లు చెప్పటమని నీవు అనుకోలేదు కదా! అన్నారు

ఈ సంఘటన తరువాత విద్యార్థి బాగా కష్టపడ్డాడు. తెలుగులోనే కాకుండా ఆంగ్లములోను హిందీలోను అందినంత వరకు చిన్నకథలను విరామము లేకుండా చదివాడు. చదివినవే తిరిగి చదువుతూ విషయాలు బాగా మననము చేసుకుంటూ గడిపాడు.

వ్యక్తిని ముందుకు తీసుకొని పోగలిగినది పట్టుదల ఒక్కటే. విద్యార్థి తన రచనలను జేబులో ఇముడ్చుకొని జరీ వల్లెవాటు గాలికి ఊగిపోతుండగా దర్జాగా ఒకనాడు ఉద్యానవనములో అడుగుపెట్టాడు. మొదట వారిని దాటుకొని పోతున్న విద్యార్థి హృదయము పొంగిపోయింది. మందహాసంతో అడుగులు వేస్తున్నాడు. ఈసారి ఎదురైనవాళ్ళకు తన రచనలను అందించి సగర్వముగా నిలువబడ్డాడు. తన రచనలను చదివిన తరువాత వాళ్ళు లోలోపల నవ్వుకుంటుంటే విద్యార్థికి చాలా చికాకు కలిగింది సంగతేమిటని నోటితో అడగలేక కళ్ళతో అడిగాడు.

"మన సమస్యలను పాశ్చాత్య దృక్పథంతో చూశావు!" అన్నారు,

"రెండవదాని మాట?" ఎర్రబడిన ముఖముతో విద్యార్థి అడిగాడు.

"ఈ సమస్యలు మనకు ఇంకా రాలేదుగా!" అన్నారు పెదవి విరుస్తూ. "కథను చదువుతుంటే కంటితో చూస్తున్నట్టుగా ఉండాలి. మన సంఘములో లేని వాటిని ఎలా చూడగలము?" అన్నారు.

కాగితాలను తిరిగి జేబులో పెట్టుకుంటూ "సమస్యలు కావాలంటారు. చూపిస్తే అవి మనవి కావంటారు. నిర్దాక్షిణ్యముగా విసరిపారవేస్తున్నారు. ఒక్కరయినా రచయిత దృక్పథాన్ని అర్థము చేసుకోలేరు కదా!" గొణుగుతూ విద్యార్థి తిరిగి వెళ్ళిపోయాడు. ఆరు నెలల వరకు ఆ ఉద్యానవనములో అడుగు పెట్టదలచు కొనలేదు

అభిమానము వెనుకకు లాగుతున్నప్పటికీ పట్టుదల విద్యార్థిని ఒక చోట కూర్చొన నివ్వలేదు ఆరు నెలలు కాదు గదా మూడు నెలలయినా నిలువలేకపోయి నాడు. విద్యార్థిని చూడగానే ఉద్యానవనములోని కావలివారు ఆప్యాయముగా పలుక రించారు. ఇంకా పై వారు చిరునవ్వుతో ఎదురొచ్చి 'నిరుత్సాహపడ్డావా అబ్బాయి! కాపిడివల్లనే మంచి పదును వస్తుంది.' అంటూ వీపుమీద తట్టారు. ఇంకా కాస్త ముందుకుపోగానే అక్కడివారు నలుగురూ విద్యార్థి రచనలన్నీ చదివి 'శరత్ రచనతో ప్రారంభించి ఇంగ్లీషు కథతో ముగించావు! అయినా మంచి శైలి పట్టుపడ్డది. దీని మూలాధారము తెలియనివాళ్ళకు నీవు స్వయంగా వ్రాసినట్లే తోస్తుంది' వరుసగా నలుగురూ కరచాలనము చేస్తూ నవ్వటము మొదలుపెట్టారు.

విద్యార్థి ముఖము చిన్నబోయింది. చివాలున లేచి ఇంటికి దారితీశాడు. ఆ నాటి నుంచీ విద్యార్థి ఎన్ని కథలు వ్రాయాలని ప్రయత్నించాడో లెక్కలేదు. ప్రఖ్యాతరచయితలచే వ్రాయబడిన మనస్తత్వశాస్త్రము లన్నీ తిరగవేశాడు. అనేక మంది కథకుల స్వగతాలను అనుభవాలను తెలుసుకొన్నాడు.

ఒకనాటి సాయంకాలము ఉద్యానవనములో ప్రవేశించి తలవంచుకొని ఆలోచిస్తూ విద్యార్థి నడుస్తున్నాడు. కాగితాలు చేతిలో లేవు కనుక అందరు చూచి ఊరు కున్నారు. పదిమంది చెట్టుక్రింద చేరి కథానికా రచనమీద చర్చించుకుంటున్నారు. విద్యార్థి కూడా వాళ్ళలోచేరి వింటున్నాడు. అంతా విన్న తరువాత తాను ప్రారంభించాడు. "కథానికను ఈ విధముగా ప్రారంభించాలనీ ఈ విధముగా ముగించాలనీ నియమాలను ఏర్పరుస్తున్నారు. మీది వృథాశ్రమ అని నా నమ్మకము. కథావస్తువును కథలో వ్రాయవలసిన విషయాలను గురించి కూడా మీరే నిర్ణయము చేస్తున్నారు. మీరు అనుకున్నట్లుగా కథ ప్రారంభము కాదు ఐతే బాగుండదు. మీరు చెప్పినట్టుగా ముగింపుకువస్తే అసహ్యముగా ఉంటుంది. ఇంగ్లీషు నవలలో పేరుపొందిన వాటిని గురించి చాలమంది చెత్తగంప అనటము మీరు వినలేదేమో!

అసలు రచయితకున్న దృక్పథము విమర్శకుడికి ఉండదు చూడండి. అభిరుచి అనేది మనిషినిపట్టి భిన్నిస్తుంది. అంతమాత్రపు విశాలభావము లేకపోతే మీరు కథలను ఎట్లా చదువగలుగుతారు? కథలలో సెక్సు రాకూడదు చావు రాకూడదు ఆకలి రాకూడదు పేదవాడు రాకూడదు. అన్నీ 'కూడదు' అంటే మరి కథకు వస్తువేది? కాగా అన్నిటిని మించినది 'స్వంతము కాదేమో' నన్న అపనమ్మకము ఒకటి. చిన్న కథలను విమర్శించటమంటే సామాన్యమైన విషయ మనుకున్నారా? వ్రాసింది బాగా లేదని అనగలరు గాని ఎట్లా ఉంటే బాగుంటుందో మచ్చుకు ఒకటి వ్రాసిచూపించండి. మీరు వ్రాయలేరుచెప్పలేరుకాని వ్రాసినవి బాగాలేవనిమాత్రముఅనగలరు'' చెమటతో దేహము తడిసిపోయి స్వరము కంపించేవరకు విద్యార్థి మాట్లాడాడు.

"నీకు కోపము వచ్చినట్లుంది అబ్బాయీ! నీకు మాదొక చిన్న సలహా. మంచి విమర్శలుంటేనే గాని మంచి రచనలు ఉత్పత్తి కావు. నిరుత్సాహ పడకుండా వ్రాస్తూ ఉండాలి" అందరూ చేరి విద్యార్థిని సమాధానపరచి పంపివేశారు.

విద్యార్థి తలవంచుకొని ఇంటికి దారితీశాడు. పది అడుగుల దూరము వెళ్ళగానే 'మన వాళ్ళల్లో కూడా బాగా వ్రాసేవాళ్ళు ఉన్నారు. లేరని మనము అనుకోకూడదు' అని వాళ్ళనుకొన్న మాటలు చెవినపడ్డాయి.

కథారచనతో తలక్రింద లవుతున్న విద్యార్థికి ఉబలాటము ఉత్సాహము నానాటికి పెరుగుతూనే వున్నాయి.

ఒక పర్యాయము మరొక పెద్ద చర్చ జరిగింది. "ఒక్కొక్క కాలానికి, ఒక్కొక్క విషయానికి ప్రాముఖ్యము ఉంటుంది. ఈ కాలములో వంధ్యాత్వమును గురించి వ్రాసినదానికంటె సంతాన నిరోధమును గురించి వ్రాస్తే ఆకర్షణీయముగా ఉంటుంది. వరకట్నాలు శృంగార సంభాషణలు ప్రాత సమస్య లనిపించుకొంటున్నాయి. వితంతువుల సమస్య కొట్టినపిండి. మనకు కావలసినవి విశ్వజనీనములైన సమస్యలు మానవ స్వభావములోని వైచిత్ర్యాలు - స్వభావములోని పరస్పర విరుద్ధభావముల మధ్య సంఘర్షణలు మొదలైన నూతన విషయాలు. వీటిని కథలలో చిత్రించగలిగితే రచయిత కృతకృత్యుడైనట్లు భావించవచ్చును."

విద్యార్థి రచయితగా ఈ విషయాలలో మునిగి తేలుతున్నాడు. వ్రాయటము చింపటము ఎన్ని కాగితాలు ఖర్చయినవో-ఎంత సిరా ఖర్చయినదో!

ఏ దేశములో గాని ఏ కాలములో గాని ఏ అంతస్తులో ఉన్న వారికి గాని హృదయాన్ని కదలించే సమస్యను తీసుకొని పోతపోసిన సమాసాలతో మనోజ్ఞమైన శైలిలో కథ ప్రారంభమైనట్లుగాని ముగిసిపోయినట్లుగాని ఎవరికీ తెలియకుండా కొన్ని కథలను విద్యార్థి రచించ గలిగాడు.

ఈ పర్యాయము విద్యార్థిని రచయితగా నీరాజనాలిస్తూ ఆహ్వానించారు. ఉన్నతాసనము మీద కూర్చోబెట్టారు. పూలహారాలు వేశారు. ఉద్యానవనములో తిరుగుతున్న పదిమంది చేరి అభినందించారు.

రచయితకు ఈ సన్మానాలు తృప్తిని కలిగించలేదు కథారచనను కైవసము చేసుకొని ఉద్యానవనములోని కథామంటపములో ఆసీనుడై అగ్రతాంబూలము నందుకొనవలెనని తహతహలాడి పోతున్నాడు 'తనకు అక్కడికి వెళ్ళగల అర్హత ఉన్నదని వాళ్ళకు ఎందుకు తోచదో' అతడికి అర్థము కాలేదు.

''నాకు ఈ పూలహారాలు ఈ సన్మానాలు లక్ష్యము లేదు. నేను ఆ మంటపములో ఆసీనుడను కావాలి-అదే నా కోరిక'' అన్నాడు.

''నీవు ఆ గౌరవానికి పాత్రుడవే, నీవి ఉత్తమరచన లనిపించుకుంటాయి. వ్రాసే వారిలో నీవు మొదటి తరగతికి చెందుతావు. అందులో సందేహము లేదు'' అన్నారు

''అయితే నన్ను అక్కడికి వెళ్ళనీయరేం? ఇంకా అభ్యంతరము ఏమిటి?'' అన్నాడు రచయిత ఆందోళనతో.

వారిలో వారు నవ్వుకొన్నారు. వారిలో ఒకరు ''అక్కడికి వెళ్ళాలని అంత వ్యామోహము ఏమిటి? బాగున్నాయని మేము అన్నాముగా! అక్కడి ప్రత్యేకత ఏమిటి?'' అన్నారు.

''దాని ప్రత్యేకతను గురించి కూడా నేనే చెప్పనా? అది కథామంటపము కథారచయితకుఅగ్రస్థాన మన్నమాట! నేను తగిన అర్హతను సంపాదించానని మీరేగా అన్నది. ఇంకా ఆలస్యము దేనికి? ఏమి అభ్యంతరము?'' రచయిత విసుగుకొద్దీ చేతులను పిండుకొన్నాడు.

వాళ్ళు నవ్వుకొన్నారు. "అబ్బాయీ! ఆ మంటపము మీదికి అందరినీ వెళ్ళ నీయము. ఈస్థానములో నిలువబడి దానిని పరమావధిగా భావించి రచనలుసాగిస్తూ ఉండు. నీమంచికోసమే చెప్పుతున్నాము. అందరికి అక్కడికి వెళ్ళాలన్న ఉబలాటమే గాని తీరా అక్కడికి వెళ్ళిన తరువాత ఒక్క మంచి కథను వ్రాయలేరు. నిజము చెప్పాలంటే ఇప్పుడు నీవు నిలువబడిన స్థానమే ఉత్తమమైనది'' అన్నారు.

"మీరంతా మొదటినుంచీ నన్ను ఇట్లాగే వేధిస్తున్నారు ఎటువంటి వాళ్ళయినా ఈ పరిస్థితిలో శాంతాన్ని కోల్పోతారని మీకు తెలియదేమో! చూడండి నేను అడుగుదామనుకుంటూనే మరచిపోతున్నాను. మీకు ఈ ఉద్యానవనములో ఏమి పనో చెప్పారుకారు!'' అన్నాడు విద్యార్థి.

'మాకా!' నలుగురూ నవ్వారు. 'మాది పోలీసు శాఖ' అన్నారు.

'అందుకే నేమో మాటలు కాస్త బిరుసుగాను నిర్మొగమాటముగాను ఉన్నాయి.' విద్యార్థి గిరుక్కున వెనుకకు తిరిగాడు.

విద్యార్థి రచనలు బీరువాలు నిండిపోతున్నాయి అందరు 'బాగానే ఉన్నాయని' అంటున్నారు గాని అతడి కోరికమాత్రము అప్పటికీ ఇప్పటికీ నెరవేరలేదు.....